

సుదీర్ఘకాలంగా విజయనగరంలోని ఉడాకాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించింది. తాగునీటి సరఫరా మెరుగు పడింది. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబుల ఆగడాలు తప్పాయి. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు చెక్ పడింది. ముఖ్యంగా గాంధీపార్కునకు ప్రహరీ నిర్మాణానికి కూడా అడుగులు పడ్డాయి. ఇటీవల పనులకు శంకుస్థాపన కూడా జరిగింది. ఇవన్నీ ఆంధ్రజ్యోతి జనవరి 28న చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సభతోనే సాకారమయ్యాయి. ఆ సమావేశంలో ప్రజలు విన్నవించిన సమస్యలను నేతలు, అధికారులు పరిష్కరించారు. ఈ నేపథ్యంలో కాలనీ వాసులతో మాట్లాడేందుకు ఈ నెల 12న నేతలు, అధికారులతో మరోసారి సభ జరుగనుంది.

అండగా నిలిచి అవస్థలు తీర్చి

- ఉడాకాలనీ వాసులకు ఊరట
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంతో అభివృద్ధి
- ప్రధాన సమస్యలకు పరిష్కారం
- రేపు నేతలు, అధికారులతో సభ


అభివృద్ధి చేయనున్న గాంధీపార్కు ఇదే

విజయనగరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ఉడాకాలనీ వాసులు చాలా కాలంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక సౌకర్యాలకు నోచుకోక, ఎలాంటి అభివృద్ధి పనులు జరగక, కీలకమైన గాంధీ పార్కు ఉపయోగపడక అవస్థలు పడుతున్నారు. వీటికి పరిష్కారం చూపాలని 'ఆంధ్రజ్యోతి' సంకల్పించి ఈఏడాది జనవరి 28న 'అక్షరం అండగా..పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాన్ని ఉడాకాలనీ ఫేజ్-2లోని గాంధీ పార్కులో నిర్వహించింది. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమానికి ముందు, కార్యక్రమం తరువాత ఆంధ్రజ్యోతి ఆయా సమస్యల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వార్తల రూపంలోనూ ప్రచురించింది. అనంతరం అధికారులు స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కాలనీలో నీటి సరఫరాకు సంబంధించి కొత్త మోటార్లు బిగించారు. దీంతో తాగునీటి సమస్యలు తీరాయి. కాలనీలోని ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించడంతో రెవెన్యూ అధికారులు వచ్చి పరిశీలించి కబ్జా కాకుండా చూశారు. ఉడాకాలనీలో మద్యంషాపు వద్ద బహిరంగంగా మద్యాన్ని సేవించడం పూర్తిగా తగ్గింది. మందుబాబుల ఆగడాలు ఇప్పుడు లేవు. కాగా గాంధీపార్కునకు ప్రహరీ, పార్కులో విద్యుత్ లైట్లు పనిచేయడం లేదు. గోడ బాగాలేకపోవడం వల్ల పందులు, కుక్కలు లోపలికి వస్తున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి కూడా అడుగులు పడ్డాయి. ఈ నెల 2న గోడ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. 'ఆంధ్రజ్యోతి' చొరవతో ఉడాకాలనీ సమస్యలు పరిష్కారం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రూ.35 లక్షల 85 వేలతో గాంధీ పార్కు అభివృద్ధి

ఉడాకాలనీ ఫేజ్-2లోని గాంధీ పార్కు అభివృద్ధికి విశాఖ మెట్రోపాలిటీన్ రీజయన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) రూ.35 లక్షల 85 వేలు కేటాయించింది. ఈ పనులకు విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, నగరపాలకసంస్థ కమిషనర్ నల్లనయ్య తదితరులు ఈ నెల 2న శంకుస్థాపన (మిగతా 8వ పేజీలో..)

ఆకతాయిల ఆగడాలకు కళ్లెం

- రాత్రి వేళల్లో ప్రత్యేక గస్తీ ముమ్మరం
- ఎస్పీ వకుల్‌జిందాల్



విజయనగరం క్రైం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎటువంటి కారణం లేకుండా రాత్రిపూట బహిరంగంగా తిరిగే ఆకతాయిల ఆగడాలకు కళ్లెం వేస్తామని ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చ రించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో ప్రతి రోజూ రాత్రి పెట్రోలింగు నిర్వహిస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ-నేరాల నియంత్రణకు కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని అందుకు అనుగుణంగా పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. జిల్లా కేంద్రంలో రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, మూడులాంతర్లు, కోట జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్, దాసన్నపేట రైతుబజారు, కొత్తపేట, వీటి అగ్రహారంతో పాటు జిల్లాలోని బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం మున్సిపాలిటీల్లోని కొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రతి రోజూ తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. రాత్రి 11 తరువాత వ్యాపారులు తమ, తమ షాపులు మూసివేయాలని సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యాపారం సాగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రాత్రి గస్తీలో ఆయా బీట్ పరిధిలో హిస్టరీ షీట్ కలిగిన వ్యక్తుల కదలికలను గమనించాలని అధికారులను ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించి వారి వేలిముద్రలను ఎంఎస్‌డీ పరికరంతో చెక్ చేయాలని ఆదేశించారు. రాత్రి గస్తీ, పెట్రోలింగు నిర్వహించే సిబ్బంది తమ వెంట టార్చిలైట్లు, విజిల్స్, లాఠీలను తప్పనిసరిగా తీసుకువెళ్లాలన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకూ కారణాలు లేకుండా రాత్రి 11 గంటలు తరువాత సంచరించే వారిపై జిల్లా వ్యాప్తంగా 3, 573 కేసులు నమోదు చేశామని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు.


కొండకరకాం గ్రామంలో కార్డెన్ సెర్చ్

విజయనగరం క్రైం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణే లక్ష్యంగా విజయనగరం రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని కొండకరకాం గ్రామంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఎస్పీ ఆదేశాలతో రూరల్ సీఐ లక్ష్మణరావు (మిగతా 8వ పేజీలో..)

20 ఎకరాల కబ్జా

- కొండను చెరబట్టిన ఆక్రమణదారులు
- విలువ రూ.4 కోట్లు పైమాటే
- పంచాయతీలకు కేటాయించిన సోషల్ ఫారెస్ట్ భూములు పక్కదారి


ఆక్రమణలో ఉన్న సోషల్ ఫారెస్ట్ భూమి



అది 20 ఎకరాల ప్రభుత్వ భూమి. ఆ ప్రకృతి సంపదను పప్పుబెల్లాల్లా ఎవరికివారు ఇష్టారాజ్యంగా వాటాలు వేసేసుకున్నారు. కొన్నాళ్లపాటు దర్జాగా సాగుచేసుకొని ఫలసాయాన్ని కూడా అనుభవించి ఆ తర్వాత సొంతభూమిని వారసులకు రాసి ఇచ్చేసినంత సునాయాసంగా చేతులు మార్చేసి దండిగా దండుకున్నారు. కబ్జాకు గురైన 20 ఎకరాల భూమి విలువ ఎకరా రూ.20 లక్షలు చొప్పున రూ4 కోట్లు వరకూ ఉంటుందని ఓ అంచనా. ఈ భూబాగోతంపై అధికార యంత్రాంగం దృష్టి సారించకపోవడంపై ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయి.

మెంటాడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : మెంటాడ మండలం పెదచామలాపల్లి, దత్తిరాజేరు మండలం చినచామలాపల్లి, ఇంగిలాపల్లి రెవెన్యూ పరిధిలో 150 ఎకరాలు పైబడిన కొండ ఉంది. ముప్పై ఏళ్ల క్రితం ఈ కొండపై ఫారెస్ట్ అధికారులు 50 ఎకరాల్లో జీడు మామిడి మొక్కలు నాటారు. కొన్నాళ్ల పాటు అటవీశాఖ ఆధీనంలో ఆ భూములు ఉండేవి. అప్పటి ప్రభుత్వ నిబంధనల మేరకు పంచాయతీలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఆ భూమిని కొండకు ఆనుకొని ఉన్న మెంటాడ మండలం పెదచామలాపల్లి, దత్తిరాజేరు మండలం చినచామలాపల్లి, ఇంగిలాపల్లి గ్రామాలకు అధికారులు అప్పగించారు. పంటపై వచ్చిన ఫలసాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలని పేర్కొన్నారు. భూముల హద్దులు చూపుతూ మూడు పంచాయతీలకు భూమిని అప్పగించారు. చినచామలాపల్లి, ఇంగిలాపల్లి గ్రామాలకు సర్వే నెంబరు 1,2,3 పరిధిలోని కొండను, పెదచామలాపల్లెకు సర్వే నెంబరు 19లో వున్న భూమిని అప్పగించారు. 50 ఎకరాలను ఈ మూడు పంచాయతీలకు కొన్నేళ్ల (మిగతా 8వ పేజీలో..)


సోషల్ ఫారెస్ట్ భూముల ఆదాయం గురించి తెలియదంటున్న ఇంగిలాపల్లి గ్రామస్థులు

టిడ్కో గృహాల దశ మారేనా?


రామన్నదొరవలసలోని టిడ్కో ఇళ్లు

బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలోని రామన్నదొరవలస సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు సమీపంలో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు ఇప్పటికైనా లబ్ధిదారుల చెంతకు చేరుతాయా? వారి సొంతంటి కల నెరువేరుతుందా? ప్రభుత్వం తొందరగా సానుకూల నిర్ణయం తీసుకుంటుందా? ఈ ప్రశ్నలకు ఇప్పుడైతే జవాబు దొరకడం లేదు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్లలో ఎక్కడి పనులక్కడే ఆగిపోయాయి. నిర్వహణ లేక గోడలు, తలుపులు, కిటికీలు చెదలు పట్టి పాడైన పరిస్థితి. లబ్ధిదారులైతే కూటమి ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందన్న ఆశతో ఉన్నారు.

- అప్పగించాలని కోరుతున్న లబ్ధిదారులు
- రద్దయిన వారు డబ్బులు వాపస్ ఇవ్వాలని విన్నపం
- ప్రభుత్వం వచ్చి ఏడాదైనా కదలిక లేని వైనం

బొబ్బిలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలోని రామన్నదొరవలస సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు సమీపంలో 31.69 ఎకరాల్లో 2448 ఇళ్లను జీప్లస్ 5 ప్రాతిపదికన రూ.164.77 కోట్ల అంచనాతో ప్రారంభించారు. 2019 ఎన్నికల ముందు ఓ పండుగ వాతావరణంలో లబ్ధిదారులతో టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించి లాటరీ పద్ధతిలో ఇళ్లను కేటాయించారు. పనులు చురుగ్గా జరుగుతున్న సమయంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారిపోవడం జరిగింది. అధికారం చేపట్టిన వైసీపీ రాజకీయపరమైన ఆలోచనతో వీటిని విస్మరించింది. ఎక్కడి పనులక్కడే ఆగిపోయాయి. వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఈ ఇళ్లకు పోటీగా జగనన్న ఇళ్ల కాలనీల నిర్మాణాలను ప్రారంభించింది. అటు టిడ్కో ఇళ్లను గాని, ఇటు జగనన్న ఇళ్ల కాలనీలను గాని వేటినీ పూర్తి చేయలేకపోయింది. వైసీపీ హయాంలో (మిగతా 8వ పేజీలో..)

ఖరీఫ్‌లో కరువు ఛాయలు

- సీజన్ అంతా లోటు వర్షపాతం
- ఇప్పటి వరకూ 35 శాతమే ఉబాలు
- 15 లోగా నాట్లు పడకపోతే ప్రత్యామ్నాయ పంటలపై ఆధారం


నరవలో ఎండుతున్న నాట్లు

విజయనగరం కలెక్టరేట్, అగస్టు 10 (ఆంధ్రజ్యోతి):అన్నదాతకు ఈ ఖరీఫ్ సీజన్ కలిసివచ్చినట్టు కనిపించడం లేదు. ఆదిలోనే అవస్థలు మొదలయ్యాయి. ఈ సీజన్ అంతా జిల్లాలో లోటు వర్షపాతం నమోదైంది. దీంతో రైతన్నలకు వరి పంటపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 35 శాతమే ఉబాలు జరిగింది.

ఈనెల 15లోగా ఉబాలు పూర్తికాకపోతే ప్రత్యామ్నాయ పంటలపై రైతులు ఆధారపడాల్సి వస్తుంది. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కన్పిస్తోంది. ఖరీఫ్ సీజన్ మొదట్లో వర్షాలు అనుకూలంగా కురవడంతో రైతులు సంబరపడిపోయారు. ఇక ఈ ఏడాది పంటలు బాగా పండుతాయని ఆశపడ్డారు. తరువాత జూన్ నుంచి ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా లోటు వర్షపాతమే నమోదు అయ్యింది. పంటకు అనుకూలమైన జూన్, జూలై నెలల్లో కురవాల్సిన వర్షం కంటే తక్కువగా (మిగతా 8వ పేజీలో..)



రాష్ట్రంలో పారదర్శక పాలన

విజయనగరం రూరల్, ఆగస్టు 10(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో పారదర్శక పాలన నడుస్తున్నదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ ఆ శాఖలో జరిగే అక్రమాలపై స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విచారణ కోరి తన పారదర్శకతను చూపించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో అవినీతికి తావులేదన్నారు. ఈసందర్భంగా ఆయన ఎమ్మెల్సీ బొత్సకు బహిరంగ లేఖ రాశారు.

రక్తదానంపై అపోహలు వీడాలి

గజపతినగరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): యువత రక్తదానంపై అపోహలు విడనాడాలని సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి రేవంత్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు సహకారంతో 25 మంది నుంచి రక్తం సేకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారికి ఆదుకున్నవాళ్లు అవుతారని అన్నారు. సభ్యులు పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలను గుర్తించండి



నీరు లేని కాలువను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

సంతకవిటి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తోటపల్లి కాలువ ఆయకట్టు రైతుల సాగునీటి కష్టాలను గుర్తించాలని రాజాం నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షుడు వల్లూరు గణేష్. జేఈ రఘును కోరారు. ఆదివారం ఆయన జేఈతో కలిసి సంతకవిటి మండలంలోని బొద్దూరు, బిళ్లాని, తలతంపర, గుళ్లసీతారాంపురం, ఎస్.రంగారాయపురం, తాలాడతో పాటు రేగిడి మండలం అంబఖండి, సోమరాజుపేట, వావిలవలస గ్రామాల వద్ద తోటపల్లి కాలువల పరిస్థితిని, ఆయకట్టులో ఉన్న పంట భూములను పరిశీలించారు. 22-ఆర్ రాజాం బ్యాంకు కెనాల్ పరిధిలోని సంతకవిటి, రేగిడి మండలాల్లో 3200 ఎకరాలు ఆధారపడి ఉందని ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. తోటపల్లి కాలువల ద్వారా సాగునీరు రాకపోవడంతో రైతులు సేద్యం చేసేందుకు ముందుకు వెళ్లలేకపోతున్నారని అన్నారు. తక్షణమే సంతకవిటి రేగిడి మండలాల తోటపల్లి కాలువ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వల్లూరు అప్పారావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

సాతంవలస పీఏసీఎస్ చైర్మన్‌గా అప్పలనాయుడు

మెరకముడిదాం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఎం.రావివలస పంచాయతీ సాతంవలస పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా పిన్నింటి అప్పలనాయుడు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు హాజరయ్యారు. టీడీపీ మండల అధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు, బైరిపురం ఏఎంసీ చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్, మాజీ మండల అధ్యక్షుడు కోట్ల మోతీలాల్‌నాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి

విజయనగరం గంటస్తంభం, ఆగస్టు 10 (ఆంధ్ర జ్యోతి): శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎం.గేయానంద అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 13, 14 తేదీల్లో జిల్లాలో జన విజ్ఞాన వేదిక మహాసభలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ మహాసభలకు 26 జిల్లాల నుంచి 300 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలో పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుందని దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చించే విధంగా ఈ మహాసభలు ఉంటాయని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎస్.లక్ష్మణరావు, ఎంవీఎస్ శర్మలతో పాటు ప్రొఫెసర్ నాగేశ్వరరావు, బాల సుబ్రహ్మణ్యం ఈ సమావేశాలకు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో వేదిక ప్రతినిధులు రాజ్‌గోపాల్, గిరిధర్, వెంకటరావు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే

- గోతులమయంగా రాజాం-బొద్దాం రోడ్డు

రాజాం రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాజాం నుంచి బొద్దాం వరకూ సుమారు ఐదు కిలోమీటర్ల మేర రహదారి గోతల మయంగా మారింది. ఈ రోడ్డులోని రాజాం-పెనుబాక మార్గంలో ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో ఇప్పటికే ఒక గొయ్యి ఉండగా, తాజా మరో గొయ్యి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ దారిలో ఏమాత్రం ఆదమరిచి ప్రయాణిస్తే వాహన చోదకులకు ప్రమాదం తప్పదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.



రాజాం, పెనుబాక మధ్య రోడ్డుపై ఏర్పడిన గోతులు

ఆలయ భూములనూ వదలడం లేదు

- జామి పరిధిలో దర్జాగా అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

జామి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జామి పరిధిలో ఉన్న ఆలయ భూములపై అక్రమార్కుల కన్నుపడింది. వీటిని పరిరక్షించాల్సిన సంబంధిత అధికారులు వీటిని కనీసం పట్టించుకోకపోవడంతో ఇవి అన్యాక్రాంతం అవుతున్నాయి. స్థానిక దొండపర్తి జంక్షన్ దాటిన తర్వాత పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న ఆలయ భూముల్లో ఒక వ్యక్తి దర్జాగా నిర్మాణం చేపట్టాడు. ప్రతినిత్యం ఇదే రహదారిలో తిరిగే సంబంధిత శాఖకు ఇవి కాన రాకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు అంటున్నారు. ఆలయాల భూములను రక్షించాలని కోరుతున్నారు.

- ఈ విషయంపై జామి ఎల్లారమ్మ ఆలయం ఈవో ప్రసాద్‌ను వివరణ కోరగా.. అవి విజయనగరం పైడితల్లమ్మ అమ్మవారి దేవస్థానం భూములని తెలిపారు.



దేవదాయశాఖకు చెందిన స్థలంలో నిర్మిస్తున్న షెడ్డు

అన్ని ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం/ విజయనగరం రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ప్రాంతం అభివృద్ధి కావాలి.. ప్రతిఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల దగ్గరకి, ప్రజల్లోకి వెళ్లే నాయకుడు చంద్రబాబునాయుడేనన్నారు. వైసీపీ నాయకులు ప్రజల్లోకి వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉండేదన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 విధానాన్ని ఏపీలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. 30 ఏళ్ల కిందటే హైదరాబాదు నగరాన్ని నిర్మించి అభివృద్ధి చేశారన్నారు. ఏపీ రాజధాని అమరావతిని కూడా అత్యున్నత స్థాయిలో నిర్మిస్తున్నారని తెలిపారు. ఇంతలా సుపరిపాలన చేస్తుంటే, వైసీపీ నేత బొత్స సత్యనారాయణ విమర్శలు గుప్పిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రకు బొత్స చేసింది ఏమి లేదని, నేడు మాట్లాడే అర్హత కూడా లేదన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడిపై ఆరోపణలు వచ్చిన వెంటనే ఆయ న స్పందించి దర్యాప్తు చేయమని స్వయంగా మంత్రికి లేఖ రాశారన్నారు. బొత్స తన కుటుం బ సభ్యులను నాయకులుగా తయారు చేసుకున్నారని విమర్శించారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి

జగన్‌కి జ్ఞానోదయం చేయాలి: ఎంపీ కలిశెట్టి

రాష్ట్రంలోని వైసీపీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి జ్ఞానోదయం చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హితవు పలికారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పరిశ్రమల స్థాపన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పాటుపడుతుంటే, పారిశ్రామికవేత్తలు ఆంధ్రాకు రావొద్దని జగన్ ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పనిచేస్తామంటే టీడీపీ ఎప్పుడూ అడ్డుకోలేదని, అయినా జగన్ ఏమి చేయలేకపోయారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబును చూసి బుద్ధి తెచ్చుకోవాలని హితవుపలికారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కర్రోతు సత్యనారాయణ, కొండపల్లి భాస్కరనాయుడు, టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి సాయం



బాలిక కుటుంబానికి నగదు అందిస్తున్న యువత

జామి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా రేవిడి వెంకటాపురం గ్రామానికి చెందిన గోలగాని రమణమ్మ అనే 16 ఏళ్ల బాలిక కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోందని గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో రావడంతో జామి మండలంలోని లొట్లపల్లి యువత స్పందించారు. గ్రామానికి చెందిన జన్నేల బాలకృష్ణ ఆ బాలికకు తమ వంతు సాయం చేయాలని నిశ్చయించుకున్నాడు. తన మిత్రులైన మధుర రెస్టారెంట్ శ్రీను, ప్రసాద్, ప్రవీణ్, సాయికిరణ్, సురేష్, శ్రీనులు కలిసి రూ.50,116 సేకరించి ఆదివారం ఆ కుటుంబానికి అందజేశారు.

పేదలకు అండగా చంద్రబాబు

- ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలుస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం ఆమె లక్కవరపుకోటలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఐదు మండలాలకు చెందిన తొమ్మిది మందికి 8లక్షల 24వేల 513రూపాయలను చెక్కుల రూపంలో అందజేశారు. కార్పొరేట్ వైద్యం పొందలేని పేద కుటుంబాలను ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటోందని తెలిపారు. నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో ఇప్పటివరకు సుమారు రూ.3కోట్లు ఆర్థిక సాయం అందించామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, జీఎస్ నాయుడు, కోళ్ల శ్రీను, కరెడ్ల ఈశ్వరరావు, ఉమేష్ కొట్యాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఐఆర్‌ని ప్రకటించాలి

విజయనగరం రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, తక్షణమే పీఆర్సీ కమిషనర్‌ను నియమించి, ఐఆర్‌ని ప్రకటించాలని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జోగారావు, సీహెచ్ సూరిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కణపాకలోని యూత్ హాస్టల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పెండింగ్ బకాయిలు డీఏ, పీఆర్సీ ఏరియర్స్, ఎస్ఎల్ బకాయిలు చెల్లించాలన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్స్‌కి ఎంఈవో-1 బాధ్యతల నుంచి తప్పించి, ఏకీకృత సర్వీసు రూల్స్‌ని అమలుచేసి జడ్పీ స్కూల్‌లో అసిస్టెంట్లకు ఎంఈవో పదోన్నతులు ఇవ్వాలన్నారు. సంఘ ప్రతినిధులు ఎంఏ స్వామి, రాం బాబు, చిట్టిబాబు, అర్జునుడు, బంగారయ్య పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సంస్థలో ఆప్తాలమిక్ సహాయకుని నియామకం

చీపురుపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్‌క్రాస్ సంస్థలో సేవలు అందించేందుకు ఆప్తాలమిక్ సహాయకుణ్ణి నియమించినట్టు ఆ సంస్థ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు, చీపురుపల్లి డివిజన్ సమన్వయకర్త బీవీ గోవిందరాజులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థలో ఈ పోస్టు లేకపోవడం వల్ల కార్నియా సేకరణలో ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. ఇక్కడి పరిస్థితిని రెడ్‌క్రాస్ ఉన్నత స్థాయి బాధ్యులకు వివరించడంతో, ఆప్తాలమిక్ సహాయకుణ్ణి నియమించారని వారు తెలిపారు. ఇకపై దాతల నుంచి కార్నియా సేకరణలో ఎటువంటి జాప్యం జరగబోదని వారు తెలిపారు.

జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

లక్కవరపుకోట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని, గతంలో ఏషియన్ గేమ్స్ నిర్వహించిన ఘనత చంద్రబాబుదేనని తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, పుట్టా శ్రీను, శ్రీనాథ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడికి న్యాయం చేయాలి

విజయనగరం రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి అనుచరుల దాడిలో తీవ్రంగా గాయపడిన దళిత యువకుడు పవన్‌కు న్యాయం చేయాలని.. దాడికి కారకులైన వారిపై తక్షణమే అట్రాసిటీ చట్టం కింద అరెస్టు చేయాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం జొన్నగుడ్డిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ నాయకులు దళిత యువకుడు పవన్‌ను నిర్బంధించి దాడికి పాల్పడడం హేయమైన చర్యని అన్నారు. ఇప్పటికైనా దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు రాంబాబు, పైడిరాజు, రవి, చిన్న, మోహన్ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

ప్రజా పోరాట యోధుడు నాగభూషణం

విజయనగరం బాబామెట్ట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాట యోధుడు.. కామ్రేడ్ దాసరి నాగభూషణరావు అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. నాగభూషణరావు జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక అమర్‌భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ.. నాగభూషణరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కార్యదర్శిగా ఉన్నప్పుడు జిల్లా సీపీఐ నిర్మాణ బాధ్యులుగా ఉండి ఉద్యమ నిర్మాణానికి ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఆయన అడుగు జాడల్లో నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు ఆనందరావు, రంగరాజు, రమణమ్మ, అప్పారావు, జగన్నాథం పాల్గొన్నారు.



నాగభూషణరావు చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ నేతలు

సమస్యలు పట్టించుకోని వారికి సన్మానాలా?

ఎస్.కోట రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బొడ్డవర ప్రాంతంలో గత 50 రోజులుగా తాము శాంతియుత పోరాటం చేస్తుంటే.. కొంతమంది మంత్రులకు, అధికారులకు రాఖీలు కట్టి, సన్మానాలు చేయడం సరికాదని జిందాల్ నిర్వాసితులు వాపోయారు. తమ ఆదివాసీ సమస్యలను పరిష్కరించకుండా కొందరు అధికారులు, నాయకులు జిందాల్‌తో కుమ్మక్కు అయ్యారన్నారు. అనంతరం కొంతమంది మంత్రులకు, అధికారులకు సన్మానం చేస్తున్న ఫొటోలను ప్రదర్శించి సిగ్గు సిగ్గు అంటూ నినాదాలు చేశారు.



నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శిథిలావస్థలో కల్వర్టు

- నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం



తునివాడ- వెంకమ్మపేట రోడ్డులో శిథిలావస్థలో ఉన్న కల్వర్టు

రేగిడి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తునివాడ-వెంకమ్మపేట రహదారిలో ఆకులోవ గెడ్డ వద్ద ఉన్న కల్వర్టు గత కొన్నేళ్లగా శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల ప్రభుత్వం ఈ రూట్‌లో రోడ్డు నిర్మాణం, అవసరమైన చోట్ల కల్వర్టుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. అయితే ఈ పనుల నిర్వహణలో జాప్యం కావడంతో ఈ వంతెన పరిస్థితి మరింత అధ్వనంగా తయారయ్యింది. ఒక వైపు రక్షితగోడ పాడై ప్రమాద స్థితిలో ఉంది. ఏమాత్రం ఏమరపాటుగా ప్రయాణించినా ప్రమాద కొనతెచ్చుకోవాల్సిందే. దీనిపై రాజాం ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మోసే పనిలే..

- ట్రాక్టర్లతో సురక్షిత ప్రాంతాలకు పడవలు

భోగాపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సముద్రంలో వేట అనంతరం మత్స్యకారులు తమ పడవలను తాళ్లు కట్టి లాక్కుంటూ.. కర్రలతో భుజాలపై మోసుకుంటూ.. ఆపసోపాలు పడుతూ సురక్షిత ప్రాంతాలకు తీసుకొచ్చేవారు. కానీ ప్రస్తుతం వీటిని ట్రాక్టర్ల సహాయంతో సులువుగా సురక్షిత ప్రాంతాలకు తీసుకొస్తున్నారు. ఒక్కో తెప్పకు నెలకు రూ.10వేలు చొప్పున డ్రైవర్లకు అందజేస్తున్నారు. ఈ విధంగా ముక్కాంలో సుమారు 100 తెప్పలు ఉండగా.. 2 ట్రాక్టర్లను ఉపయోగించి, సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.



పడవను ట్రాక్టర్‌తో సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న దృశ్యం

మనస్తాపంతో మత్స్యకారుడి ఆత్మహత్య



రామసుందర్ (ఫైల్)

భోగాపురం, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): ముక్కాం గ్రామానికి చెందిన గనగళ్ల రామసుందర్(29) అనే మత్స్యకారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ఎస్ఐ సూర్యకుమారి ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముక్కాం గ్రామానికి చెందిన రామసుందర్‌కు కొండ్రాజుపాలెంకు చెందిన ఎలమాజీతో ఏడేళ్ల కిందట వివాహం అయ్యింది. గతంలో ఈయన సముద్రంలో వేట సాగించేవాడు. తర్వాత వేట మానేసి ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. వీరికి ఐదేళ్ల వయస్సుగల రుషి, మూడేళ్ల తన్వి అనే ఇద్దరు పిల్లలు, పక్షవాతంలో ఉన్న తండ్రి రాజు ఉన్నారు. ఇటీవల రామసుందర్ మద్యానికి అలవాటు పడడంతో భార్యా భర్తల మధ్య అప్పుడప్పుడు గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో శనివారం సాయంత్రం తన భార్యని డబ్బులు అడిగే సమయంలో కొద్దిపాటి వివాదం తలెత్తింది. దీంతో మనస్తాపానికి గురైన రామసుందర్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే విజయనగరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య ఎలమాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



జగదీష్ (ఫైల్)

గరివిడి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు పంచాయతీ పరిధిలో గల వైఎస్ఆర్ కాలనీ అనే మధుర గ్రామానికి చెందిన కర్రి జగదీష్(25) అనే యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. జగదీష్. గరివిడి, చీపురుపల్లి పట్టణాల మధ్యన పోలీసుస్టేషన్ సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకుని బైకు వాటర్ సర్వీసింగ్ సెంటర్ నడుపుతున్నాడు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఒక బైకు వాటరింగ్ చేయడానికి మోటార్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య భారతితోపాటు 2 సంవత్సరాల వయస్సుగల ఒక చిన్న పాప ఉంది.

చికిత్స పొందుతూ ఒకరు..

లక్కవరపుకోట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై హెచ్‌సీ పాపారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చినమన్నిపాలెం గ్రామానికి చెందిన బొబ్బరి వెంకటేష్(24) గతనెల 29న జమ్మాదేవిపేట బ్రిడ్జి సమీపంలో బైకుతో ఆటోను ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఇదే ప్రమాదంలో మరో వ్యక్తి అదే రోజు మృతిచెందిన విషయం తెలిసిందే.

బావి నుంచి దుర్వాసన వస్తోందని ఫిర్యాదు

- నీటిని తోడించినా దొరకని ఆధారాలు

కొత్తవలస, ఆగస్టు 10ఆంధ్రజ్యోతి): చీడివలస గ్రామానికి సమీపంలోని వ్యవసాయ నేలబావి నుంచి దుర్వాసన వస్తోందని సర్పంచ్ చలుమూరి అప్పలనాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సూచన మేరకు ఆదివారం ఉదయం నుంచి నాలుగు ఇంజన్లతో బావిలో ఉన్న నీటిని తోడించినా ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఈనెల 6వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఎనిమిది మంది వ్యక్తులు సఫారీ వాహనం, ఓ ఆటోతో ఈ బావి సమీపంలో మూటలు కట్టుకుని ఉన్నారని గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు గ్రామంలో తెలిపారు. ఈక్రమంలో ఈనెల 8వ తేదీన సర్పంచ్ గ్రామ పెద్దలతో కలిసి బావి వద్దకు వెళ్లి చూశారు. భరించ లేని విధంగా దుర్వాసన రావడంతో అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బావిలో నీటిని పూర్తిగా తోడి ఏదైనా ఆచూకీ ఉంటే తెలియజేయాలని పోలీసులు చెప్పారు. దీంతో సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ వరహాలు ఆదివారం ఉదయం నుంచి నీటిని తోడించారు. సాయంత్రానికి బావిలో నుంచి వంట సారాకు వినియోగించే నల్ల బెల్లం, యూరియా మూటలతో దొరికింది. వీటి వల్ల ఇంతటి దుర్వాసన ఎందుకు వస్తుందనే అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం చీకటిపడే వరకు ఇంకా ఇంజన్లతో ఇంకా నీటిని తోడుతునే ఉన్నారు.

పందెంరాయుళ్ల అరెస్టు

బొండపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కొత్తవలస గ్రామం పొలిమేరలో ఉన్న మామిడితోటలో కోడిపందెం రాయుళ్లపై ఆదివారం పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. స్థానిక ఎస్ఐ యు.మహేష్ తన సిబ్బందితో దాడిచేసి ఏడుగురు పందెం రాయళ్లను పట్టుకున్నారు. వారి నుంచి ఐదు కోడిపుంజులు, రూ.7,140 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణేల ఆటలో పది మంది అరెస్టు

లక్కవరపుకోట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరాపల్లి పరిసరాల్లో నాణేలతో(ఏట్లాట) ఆడుతున్న పదిమందిని పట్టుకుని అరెస్టు చేశామని ఎస్ఐ నవీన్ పడాల్ తెలిపారు. వారి నుంచి ఆరు బైకులు, రూ.42వేల 300 పట్టుకుని సీజ్ చేశామన్నారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి, దాడి చేసి, వారిని పట్టుకున్నామని తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గంట్యాడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కొండతామరాపల్లి కూడలిలో గంట్యాడ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. దీనిపై ఎస్ఐ సాయికృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జామి మండలం అనమరాజుపేట గ్రామానికి చెందిన కోరాడ చంద్రశేఖర్ ఎస్.కోట మండలం ధర్మవరం నుంచి గంట్యాడ వైపు బొలేరో వాహనంపై వస్తున్నాడు. తామరాపల్లి కూడలి వద్దకు వచ్చేసరికి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో వాహనంలో పీడీఎస్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. వెంటనే 48 బస్తాలతో 2,400 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఒప్పంగిలో లోఓల్టేజ్ సమస్యకు చెక్

రేగిడి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఒప్పంగి గ్రామానికి ఎట్టకేలకు లోఓల్టేజ్ సమస్యకు చెక్ పడిందని విద్యుత్ శాఖ ఏఈ సురేష్ కుమార్ తెలిపారు. ఈ గ్రామంలో సుమారు 360 విద్యుత్ సర్వీస్‌లు ఉండగా, ఇటీవల వీటిలో 70 సర్వీస్‌లకు తీవ్ర లోఓల్టేజ్‌తో ఇబ్బందులు ఉండేవని చెప్పారు. ఈ సమస్యను ఇటీవల మండల జనరల్ బాడీలో స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తారని, దీంతో దాదా పు రూ.3లక్షల అంచనాతో ఆదివారం సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం చూపారని ఆయన వివరించారు.

కిలారికి జాతీయ ప్రతిభా అవార్డు

లక్కవరపుకోట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ సాహితీవేత్త కిలారి గౌరినాయుడుకు సాహిత్య, సాంస్కృతిక సంగీత పరిశోధనా రంగంలో ప్రతిభా అవార్డు లభించింది. ఈ మేరకు ఏలూరు పట్టణంలోని మహాలక్ష్మీ గోపాలస్వామి కళామందిరంలో ఆదివారం ఆయన్ని ఘనంగా సన్మానించారు. 36 ఏళ్ల వయస్సులో 36 సాహిత్య పురస్కారాలు అందుకోవడం విశేషమని కొనియాడారు. ప్రముఖ సినీ మ్యూజిక్ డైరెక్టర్ సింధూ, కె.ప్రసాద్, ప్రపంచ తెలుగు సాహిత్య సంస్కృతిక అకాడమీ ఛైర్మన్ కె.ప్రతాప్‌కుమార్ తదితరులు గౌరినాయుడును సన్మానించారు.

ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడిగా రమణ

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడిగా పెంపడాపు రమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కాలేజీలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి గురాన శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎన్నిక జరిగింది. అనంతరం రమణ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబరు ఒకటో తేదీన జరగనున్న చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సందర్భంగా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలోని సంఘ కార్యదర్శి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అండగా నిలిచి.. అవస్థలు తీర్చి

(ఐదో పేజీ తరువాయి)

చేశారు. ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ, కాంట్రాక్టరుకు మధ్య ఒప్పంద ప్రక్రియ నడుస్తోంది. నెలాఖరులోగా ఈ పనులు ప్రారంభం కానున్నాయి.

● 'అక్షరం అండగా..పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంతో జరిగిన అభివృద్ధిపై స్థానికుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఉడాకాలనీ ఫేజ్-2లో మంగళవారం సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య, 43వ డివిజన్ కార్పొరేటర్ సత్యవతి, వన్‌టౌన్ సీఐ ఆర్‌వీఆర్‌కే చౌదరి, పలు విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

20 ఎకరాల కబ్జా

(ఐదో పేజీ తరువాయి)

క్రితం కేటాయించిన అటవీ అధికారులు దాన్ని సాగుచేసుకొని ఫలసాయాన్ని వేలంవేసి తద్వారా వచ్చే డబ్బును ఆయా పంచాయతీల్లో అభివృద్ధి పనుల కోసం వినియోగించేలా నాటి పంచాయతీ పెద్దలకు సూచించారు. కొన్నాళ్లపాటు ఈ ప్రక్రియ సవ్యంగా జరిగినప్పటికీ ఆ తర్వాత వచ్చిన ప్రజాప్రతినిధుల హయాంలో అది దారితప్పింది.

వేలంలో మాయాజాలం

అటవీ శాఖ కేటాయించిన భూముల్లో జీడిమామిడి సాగుచేస్తూ ఫలసాయాన్ని పంచాయతీలో అభివృద్ధి పనులకు వినియోగించేవారు. కాలక్రమంలో సర్పంచులు మారినప్పుడల్లా ఫారెస్టు భూములు వారికి అక్షయపాత్రలా మారాయి. భారీమొత్తం రావాల్సిన ఫలసాయాన్ని తమ బినామీలకు ముందే తర్ఫీదు ఇచ్చి నామమాత్రపు ధరకే వేలం పాడించారు. పంటను బయటమార్కెట్లో భారీగా సొమ్ము చేసుకొని పంచాయతీ పెద్దలకు మాత్రం నామమాత్రంగా డబ్బులు జమచేసి మిగిలింది వెనుకేసుకోవడం పరిపాటిగా మారిపోయింది. ఈ విధంగా ఆయా పంచాయతీలు గత కొన్నేళ్లలో భారీఎత్తున నిధులు కోల్పోయాయి. ఆ నామమాత్రపు నిధుల్లోనూ గోల్మాల్ జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ నిధులకు జమచేయకుండా పండగల పేరుతో మమ అనిపించేశారు.

● మొత్తం 20 ఎకరాల భూమి ఆక్రమణకు బీజం పడింది. పంచాయతీలకు ఆర్థిక తోడ్పాటు కోసం ఫారెస్ట్ అధికారులు ఉదారంగా కేటాయించిన భూమిలో కొంత భాగాన్ని ఐదేళ్లకోసారి వచ్చే కొత్త సర్పంచులు, తమ అనుచరులతో కబ్జా చేయించి తర్వాత తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఈ విధంగా 50 ఎకరాల్లోని సోషల్ ఫారెస్ట్ భూమిలో 20 ఎకరాల వరకూ అన్యాక్రాంతమై పోయాయి. ప్రస్తుతం ఆ మూడు పంచాయతీల చేతుల్లో 30 ఎకరాలే ఉన్నాయి.

● ఆక్రమణదారుల్లో ఓ అటవీశాఖ ఉద్యోగి ఉన్నారు. ఆయన కొండ దిగువనున్న మూడు ఎకరాలను ఆక్రమించారని చెప్పుకుంటుంటారు. ఆ భూమి పేదలతో 99 ఏళ్లకు లీజుకు ఒప్పందం కుదుర్చుకున్నారని చుట్టుపక్క గ్రామస్థులు చెబుతున్నారు.

● మూడు పంచాయతీలకు కేటాయించిన 50 ఎకరాల భూమిపై తమశాఖ పర్యవేక్షణ ఉండదని అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి. సోషల్ ఫారెస్ట్ భూమిలో వున్న పంట ఫలసాయం పెద్దల చేతిలో వుందని, తద్వారా వచ్చిన ఆదాయం గురించి తమకు తెలియదని, పంటకు వేలం పాట వేస్తున్నారని...అంతా గ్రామ పెద్దల నిర్ణయం మేరకు జరుగుతోందని ఆయా గ్రామస్థులు తెలిపారు.

ఆకతాయిల ఆగడాలకు కళ్లెం

(ఐదో పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి తెల్లవారుజామున విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐలు అశోక్‌కుమార్, సాయికృష్ణ, ట్రైనీ ఎస్ఐ నాని బృందాలు పాల్గొన్నాయి. అనుమానిత వ్యక్తులు పారిపోయేందుకు అవకాశం వున్న మార్గాలను ముందుగా గుర్తించి ఆయా మార్గాలను దిగ్బంధించారు. ఆపై తనిఖీలు చేశారు. ఈ ఆపరేషన్‌లో సీఐ, ముగ్గురు ఎస్ఐలు, 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో గృహాల దశ మారేనా?

(ఐదో పేజీ తరువాయి)

2023లో టిడ్కోలబ్ధిదారులతో సమావేశంజరిపి ఇళ్లనుఅప్పగించేస్తాం తీసుకోండిఅంటూ వైసీపీనాయకులు హడావిడిచేశారు. పూర్తికాకుండా ఇళ్లల్లోకి దిగేది లేదని లబ్ధిదారులంతా తెగేసి చెప్పేశారు.ఇంతలో మళ్లీ ఎన్నికలు రావడం ఈసారి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిడం జరిగింది.

● నాడు మూడు కేటగిరీల్లో ఐదు అంతస్తుల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 300 ఎస్ఎఫ్‌టి సైజులో 1344 ఇళ్లు, 365 ఎస్ఎఫ్‌టి సైజులో 528 ఇళ్లు, 430 ఎస్ఎఫ్‌టి సైజులో 576 ఇళ్ల నిర్మాణం చేపట్టగా ఒక్కో బ్లాకులో 48 ఇళ్లు చొప్పున ఉన్నాయి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రివర్స్ టెండరింగ్ పేరుతో 25 శాతం లోపు నిర్మాణం జరిగిన ఇళ్లను పూర్తిగా నిలిపేశారు. మిగిలిన ఇళ్ల పనులను చివరి వరకు సాగదీశారు.

● 700 మంది త్రిశంకుస్వర్గంలో ఉండిపోయారు. వీరంతా 25 శాతం లోపు పనుల కేటగిరీలో రద్దయిపోయిన ఇళ్ల లబ్ధిదారులు. వీరికి చెల్లించాల్సిన డిపాజిట్ సొమ్ము విషయంలో వైసీపీ పట్టించుకోలేదు. ఇప్పటికీ అదే పరిస్థితి. వారిలో కొందరికి రూ.25వేలు, ఇంకొందరికి రూ.50 వేల నుంచి రూ.లక్ష చెల్లించాల్సి(వాపస్) ఉంది.

● మెసర్స్ వీఎన్‌సీ, ఏజేఎంసీపీఎల్, ఆర్‌కెఐపీఎల్ అండ్ సింగాన్ జేవీ, వెల్కో ఇన్‌ఫ్రాటెక్ సంస్థలకు టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు అప్పగించారు. కొద్ది నిర్మాణాలను పూర్తి చేసి రోడ్డు సౌకర్యం కల్పిస్తే టిడ్కో కాలనీ ఓ టౌన్‌షిప్‌గా మారుతుంది కానీ ఆ వైపులా చర్యలు లేవు.

● కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నప్పటికీ ఇంతవరకు టిడ్కో ఇళ్లను పట్టించుకోలేదు. ఈ సమస్యపై సోమవారం సీపీఎం నాయకులు ధర్నా చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

ఖరీఫ్‌లో కరువు ఛాయలు

(ఐదో పేజీ తరువాయి)

కురిసింది. ఆగస్టు నెల అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశపడినా ఆ పరిస్థితి లేదు. దీంతో వారి పరిస్థితిలో అయోమయంలో పడింది. జిల్లా వ్యాప్తంగా 97,216 వేల హెక్టార్లు వరి సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటి వరకూ 35 వేల హెక్టార్లలో ఉబాలు పూర్తయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కొన్నిచోట్ల రైతులు చెరువుల్లోని నీటిని తోడించుకుని నాట్లు వేశారు. చివరికి అవి కూడా ఎండిపోతున్నాయి. రక్షించుకోవడానికి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే మూడు నుంచి నాలుగు సార్లు వరినారును తడుపుకున్నారు. సాధారణంగా వరినారు వేశాక 21రోజుల తరువాత ఉబాలు చేపట్టాలి. అయితే కొన్నిచోట్ల నారువేసుకుని 40 రోజులు దాటినా నాట్లు పడలేదు. ఒక వేళ ఇప్పుడు వర్షం కురిసి నాట్లు వేసుకున్నా దిగుబడి అంతగా రాదని రైతులు భావిస్తున్నారు. ఈనెల 15లోగా నాట్లువేయకపోతే ప్రత్యామ్నాయపంటలపై రైతులుఆధారపడాల్సి వస్తుంది.ఇదేవిషయాన్ని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ తారక రామారావు వద్ద ప్రస్తావించగా జిల్లాలో ఇప్పటి వరకూ 35 వేల హెక్టార్లలో వరి నాట్లు వేశారని, ఈ రెండు రోజుల్లో వర్షాలు కురిస్తే మిగిలిన చోట్ల ఉబాలు పూర్తయ్యే అవకాశాలున్నాయని తెలిపారు.

కోతకు గురై.. గోతులమయమై



కోతకు గురైన ప్రధాన రహదారి

● అప్రమత్తంగా లేకపోతే పొంచిఉన్న ప్రమాదం ● ఇదీ పార్వతీపురం-పాలకొండ రహదారిలో పరిస్థితి

గరుగుబిల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి పాలకొండ వెళ్లే ప్రధాన రహదారి మార్గానికి ఆనుకుని సీతారాంపురం, అడ్డాపుశీల గ్రామాల వద్ద రోడ్డు కోతకు గురైంది. అంతేకాకుండా పెద్దపెద్ద గోతులుకావడంతో వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ మార్గంలో శ్రీకాకుళం వైపు, పార్వతీపురం తదితర ప్రాంతాలకు ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రధానంగా రోడ్డు పక్కన బెర్ములు వేయక పోవడంతో వర్షాలకు కోతకు గురైంది. రహదారికి ఇరువైపులా గోతుల వల్ల ఏర్పడడంతో ఏపాటి ఏమరపాటునా ఉన్న ప్రమాదం పొంచిఉందని చోదకులు వాపోతున్నారు. చీకటిపడిన తర్వాత గోతులు దగ్గరకు వచ్చిన వరకూ కనిపించడంలేదని పలువురు చెబుతున్నారు. అయితే రహదారి అభివృద్ధికి సుమారు రూ. రెండు కోట్లు ఖర్చుచేసినా ఇరువైపులా బెర్ములు ఏర్పాటుచేయలేదని వాపోతున్నారు. తక్షణమే ఆర్‌అండ్‌బీ అధికారులు గోతులను పూడ్చి, బెర్ములు వేయాలని పలువురు కోరుతున్నారు.



అడ్డాపుశీల సమీపంలో రహదారికి ఆనుకుని ఏర్పడిన భారీ గొయ్యి

కూటమితో ప్రజారంజక పాలన

● పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న జయకృష్ణ

పాలకొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజారంజక పాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు.ఆదివారం మండలంలోని పనుకువలస గ్రామానికి చెందిన పొట్నూరు కూర్మారావుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.రెండు లక్షలు చెక్కును అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లా కొండలరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రాక్టీస్‌కు వెసులుబాటు కల్పించాలి

భామిని, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి):పాక్టీస్‌కు వెసులుబాటు కల్పించాలని ఆర్ఎంపీ, పీఎంపీ ప్రాక్టీషనర్లు కోరారు.ఈ మేరకు భామినిలో ఆర్ఎంపీ, పీఎంపీలు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదివారం కలిసి తమ సమస్యలను వివరించారు. కాగా భామినిలో టీడీపీ కార్యకర్త, మాజీ సర్పంచ్ లోపింటి అప్పారావును జయకృష్ణ పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవల విశాఖలో నెల రోజుల పాటు చికిత్సపొందారు. ఆయన వెంట కూటమి నాయకులు పాండురంగ, జగదీశ్వరరావు, ఆనందరావు, ప్రసాద్‌తోపాటు మనోజ్ ఉన్నారు.

'వాహనమిత్ర' ప్రకటించాలి

● ఆటో, క్యాబ్ డ్రైవర్ల యూనియన్ నాయకుల డిమాండ్



సాలూరులో నిరసన తెలుపుతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లు

సాలూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభించకముందే వాహనమిత్ర పథకాన్ని ప్రకటించాలని ఆటో, క్యాబ్ డ్రైవర్ల యూనియన్ నాయకులు డిమాండ్‌చేశారు.ప్రతి డ్రైవర్‌కు రూ.15వేలు చెల్లించాలని కోరారు. ఆదివారం పట్టణంలో ఆటో, క్యాబ్ డ్రైవర్లు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆటో క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై.నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోతున్న డ్రైవర్ల సంక్షేమం మరచిపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని తెలిపారు. ఎన్నికల ముందుఇచ్చిన హామీ ప్రకారం డ్రైవర్లకు వాహనమిత్ర పథకం అమలు చేసి రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో -21 వెంటనే రద్దుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సంతు, గున్నంనాయుడు, అక్కా అప్పారావు, గొర్లె రమేష్, మజ్జి అప్పారావు, అంపోలు సంతోష్‌కుమార్, పిన్నింటి కేశవ, పూడి ప్రవీణ్, పూడి ఈశ్వరరావు, జరజాపు జ్యోతిష్ట, సోమేశు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం

కొమరాడ,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి):మండలంలోని దళాయిపేటలో గంటేడ చిన్నమ్మలు స్మారక ప్రతిభా పురస్కారాలను ఆదివారం ప్రదానం చేశారు. ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థిని హిమరిక భవానీ, కోటిపాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.లోకేష్, దళాయిపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వడ్డీ హారికలకు నగదుతోపాటు షీల్డ్, సర్టిఫికెట్లు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో రచయిత గంటేడగౌరునాయుడు, విశ్రాంత హెచ్ఎం గంటేడ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం



ధ్వంసమైన పాచిపెంటలోని బ్యాంకు ఆఫ్ బరోడా ఏటీఎం మిషన్

పాచిపెంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ రోడ్డులో గల బ్యాంకు ఆఫ్ బరోడాకు చెందిన ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేశారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో చోరీకి ప్రయత్నించారు.బ్యాంకు ఆఫ్ బరోడా పక్కనే ఆనుకుని ఏటీఎం ఏర్పాటు చేశారు. ముందుగా సీసీ కెమెరాలను దొంగిలించి ఏటీఎం చోరీకి యత్నించగా, ఏటీఎం కొద్ది భాగం ధ్వంసమయ్యింది. ఈ మేరకు బ్యాంకు మేనేజరు ఎల్.దేవిగణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కె.వెంకటసురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

పిరిడి జంక్షన్‌లో వాహనాల తనిఖీలు

బొబ్బిలి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పిరిడి జంక్షన్‌లో బొబ్బిలి నుంచి తెర్లాం వెళ్లే రహదారిలో ఆదివారం బొబ్బిలి ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాదు ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీచేశారు.ఈ సందర్భంగా లైసెన్స్, నంబర్ ప్లేట్లు, హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదుచేసి చలానాలు విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

బొబ్బిలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని యూటీఎఫ్ జిల్లా నేత ప్రసన్నకుమార్ డిమాండ్‌చేశారు. ఆదివారం బొబ్బిలిలోయూటీఎఫ్ 52వ ఆవిర్భావదినోత్సవం పురస్కరించుకుని యూటీఎఫ్ జెండాను నాయకుడు నల్ల అజయ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కేశవరావు, శంకరరావు, రామకృష్ణ, బి.రమేష్, శశిభూషణరావు, పోలినాయుడు, అనంత్, కృష్ణదాసు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

బొబ్బిలిరూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పారాదిశివారున వంతెన మలుపు వద్ద ఆదివారం రామభద్రపురం నుంచి వస్తున్న ద్విచక్రవాహనాన్ని బొబ్బిలి నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న తండ్రి అల్తి లక్ష్మణరావు, కుమార్తె కుసుమాంజలి, ఆటోలో ఉన్న తవుడమ్మకు గాయాలయ్యాయి. కుమార్తె జ్వరంతో బాధపడుతుండడంతో బొబ్బిలి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని వారు తెలిపారు. గాయపడిన వారిని బొబ్బిలి తరలించారు.

పీఏసీఎస్‌లకు ఛైర్మన్ల నియామకం

విజయనగరం కలెక్టరేట్ ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : పీఏసీఎస్‌లకు ఛైర్మన్లు నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకూ సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జీలు ఉన్న స్థానంలో ఛైర్మన్లు నియమించారు. 2026 జనవరి 30 వరకూ కమిటీలు కొనసాగనున్నాయి. జిల్లాలోని 26 సంఘాలకు ఛైర్మన్లు నియమించారు. ప్రతి సొసైటీకి ఛైర్మన్, ఇద్దరు సభ్యులు ఉంటారు.

డివైడర్‌ను ఢీ కొట్టిన లారీ

బెలగాం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం కాంప్లెక్స్‌లోగల సిగ్నల్ పాయింట్ వద్ద డివైడర్‌ను ఆదివారం ఉదయం లారీ ఢీ కొట్టింది. దీంతో లారీ ముందుభాగం పాక్షికంగా దెబ్బతింది. లారీ మలుపుతిప్పే సమయంలో డివైడర్‌ను ఢీ కొట్టింది. మధ్యాహ్నం వరకు లారీ ఘటనాస్థలంలో ఉండిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రజలు అవస్థలకు గురయ్యారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

సాలూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి తెలిపారు.ఎస్సీఎస్టీ విద్యార్థులతో భర్తీ చేయ నున్నామని పేర్కొన్నారు.

18న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన



మాట్లాడుతున్న రాజేశ్ వర్మ

బొబ్బిలి, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీరాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ ఈనెల 18న పర్యటించనున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌వర్మ తెలిపారు. ఆదివారం బొబ్బిలిఫూల్‌బాగ్ జంక్షన్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాధవ్ బొబ్బిలి మీదుగా పార్వతీపురం వెళ్లనున్నారని, విజయనగరంలో జరిగే సమావేశానికి పెద్దసంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కోటగిరి నారాయణరావు, జిల్లా ప్రధానకార్యదర్శి వేమకోటి గిరిబాబు, జిల్లా కార్యదర్శి ముగడ అనిల్ కుమార్, పెంట స్వామినాయుడు, పుల్లెల శ్రీనివాసరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

స్వర్గధామం ప్రారంభం

బొబ్బిలి రూరల్,ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారాదిలో దివంగత బోటు శాంతరాజు, వనజాక్షమ్మ జ్ఞాపకార్థం కుమారులు సాయిరాం, మెహర్‌బాబాలు ఏర్పాటుచేసిన స్వర్గధామాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల వితరణ

పాలకొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయానికి బెంగళూరుకు శివశ్రీ చారిటబుల్ ట్రస్టు డెల్ కంపెనీ ఆర్థిక సహకారంతో రెండు కంప్యూటర్, స్మార్ట్‌టీవీ, స్మార్ట్‌ఫోన్‌ను వితరణగా ఇచ్చారు. ఈమేరకు ఆదివారం గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబుకు శిక్షణఫౌండేషన్ నుంచి జిల్లా మాస్టర్ ట్రైనర్ వల్లిదేవి ద్వారా అందించారు.

తుపాకీ రికవరీపై ముసిరాంలో దర్యాప్తు

కొత్తవలస, ఆగస్టు 10ఆంధ్రజ్యోతి): ముసిరాంలో తుపాకీ రికవరీకోసం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ముసిరాంలో ఈనెల ఐదో తేదీన గ్రామానికి చెందిన శిమ్మ అప్పారావును కాల్చి చంపిన నిందితుడు పోలీసులు అదుపులో ఉన్నా తుపాకీ ఆచూకీ ఇప్పటికీ దొరకలేదు. నిందితుడు అప్పారావును పోలీసులు నిఘా పెట్టి అనకాపల్లి జిల్లా కశింకోటలో పట్టుకున్న విషయం విదితమే. నిందితుని సోదా చేసి, కొన్ని బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం నుంచి తుపాకీ గురించి పోలీసులకు సరైన సమాచారం ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నాడు. తుపాకీని రికవరీ చేయకుండా అరెస్టు చూపించినా పెద్దగా ప్రయోజనం కనిపించదని పోలీసులు తుపాకీ కోసం వెదుకుతున్నారు. శని, ఆదివారాల్లో కూడా తుపాకీ కోసం నిందితుని పట్టుకుని తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు తుపాకీ రికవరీ పెద్ద తలనొప్పిగా మారింది. ఎవరో ఇచ్చిన సలహా మేరకే తుపాకీ గురించి ఆచూకీ చెప్పడం లేదన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

